
సాక్షి
నిజామాబాద్
శుక్రవారం ; 24 ; మార్చి ; 2023



రాష్ట్రానికి గుర్తింపు తేవాలి

ఫుట్‌బాల్ క్రీడాకారిణులు ప్రతిభ చూపి తెలంగాణ రాష్ట్రానికి పేరు తేవాలని సీపీ నాగరాజు పేర్కొన్నారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
36.8 /16.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. అక్కడక్కడ తేలికపాటినుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

ఈ అక్షరం సాక్షిగా..



- బాధితుల పక్షాన పోరు
- సర్కారును కదిలించిన వైనం
- 'యూనివర్సిటీ' కథనాలతో బుక్‌లెట్ తయారు చేసి చర్చించిన పాలకమండలి సభ్యులు.. అప్పటి రిజిస్ట్రార్ తొలగింపు
- గల్ఫ్ వలస కార్మికుల కష్టాలు, కన్నీళ్లు వెలుగులోకి..
- నగరంలో రెండు డివిజన్ల మధ్య బ్రిడ్జి నిర్మాణం
- 'సాక్షి' పదిహేనేళ్ల ప్రస్థానం

సాక్షి CELEBRATING 15 YEARS

పదిహేనేళ్ల మైలురాయి దాటి పదహారులోకి అడుగిడుతున్న 'సాక్షి' తన ప్రస్థానంలో అక్షర సామరం సాగించింది. ఎన్నో పరిశోధనాత్మక, మానవీయ కథనాలతో చెరగని ముద్రవేసింది. అక్రమార్కుల గుండెల్లో 'పెన్ను' పోటైంది. బాధితుల చెంత చేరి స్వాంతన కలిగించింది. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ఎగువన 'బాబ్లీ' ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమం సాగుతున్న వేళ.. మహారాష్ట్రలో మరో 13 ప్రాజెక్టుల నిర్మాణాన్ని బట్టబయలు చేసింది. తెలంగాణ విశ్వవిద్యాలయంలో అక్రమ నియామకాలపై కథనాలతో అప్పటి రిజిస్ట్రార్ కనకయ్యను తొలగించారు. లింగంపేట మండలం బూరుగిద్ద గ్రామాన్ని కబ్జాదారుల చెరనుంచి విడిపించింది. పసుపు గిట్టుబాటు ధర కోసం రైతుల పాదయాత్రకు అండగా నిలిచింది. కోట్ల రూపాయల్లో రైతులు లాభపద్దారు. ఎర్రజొన్న రైతుల ఉద్యమానికి ప్రత్యేక కథనాలతో ఊపునిచ్చింది. 'రైతన్నపై రౌడీ ముద్ర'ను తొలగించింది. 'గల్ఫ్ జిందగీ' పేరిట వలస కార్మికుల కష్టాలను, కన్నీళ్లను ఆవిష్కరించింది.

న్యూస్‌రీల్

పేదల చెంతకు చేరిన వైద్యం

- సాక్షి కథనంతో స్పందించిన ఎమ్మెల్యే, వైద్యాధికారులు



బోధన్‌టౌన్(బోధన్) : పట్టణంలోని శక్కర్ నగర్ కాలనీలోని నిరుపేదలకు వైద్యమంటేనే తెలియని స్థితి నుంచి వారి బస్తీలో దవాఖానా ఏర్పాటయ్యేదాకా 'సాక్షి' అలుపెరుగని పోరాటం చేసింది. జ్వరం వచ్చినా ఏమొచ్చినా పట్టణానికి వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న పని. పట్టణంలో ఉన్న పెద్దాస్పత్రికి వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న పని. దీంతో వారు రోగాలతోనే గడిపేవారు. ఈ దుస్థితి గుర్తించి 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురించగా స్థానిక ఎమ్మెల్యే షకీల్ స్పందించారు. వైద్యాధికారులతో పలుమార్లు శక్కర్‌నగర్లో పర్యటించారు. కాలనీలోని అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు బస్తీ దవఖాన ఆవశ్యకతను కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే షకీల్ 2022లో సెప్టెంబర్ 28న శక్కర్‌నగర్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయించారు.



రుణపడి ఉంటాం..



శక్కర్‌నగర్ కాలనీలో బస్తీ దవాఖానా ఆర్నెళ్ల క్రితం ఏర్పాటు చేశారు. 15 యేళ్లగా చేస్తున్న మా పోరాటానికి 'సాక్షి'పత్రిక వెన్నంటి నిలిచింది. మా సమస్యలు ఎప్పటికప్పుడు ప్రచురించింది. ప్రస్తుతం చిన్నాపెద్దా అంతా బస్తీ దవాఖానాకే వెళ్తున్నాం. సాక్షికి రుణపడి ఉంటాం.

– రేకం దాసు, కాలనీవాసి

వారధి నిర్మాణం..



నిజామాబాద్ సిటీ : నగరంలోని వినాయక్ నగర్, పద్మనగర్ డివిజన్ల మధ్య పూలాంగ్ వాగు ఉండటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఉండేవి. వినాయక్‌నగర్, పద్మనగర్ వాసులు తమతమ కాలనీల్లోకి వెళ్లిరావాలంటే చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. దాంతో రెండు డివిజన్లను కలుపుతూ పూలాంగ్‌వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని 2013లో 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురించగా 2014లో మేయర్‌గా ఎన్నికైన ఆకుల సుజాత ప్రత్యేకంగా దీనిపై మరింత దృష్టిపెట్టడంతో పూలాంగ్‌వాగుపై లోలెవల్ బ్రిడ్జి నిర్మాణం జరుపుకుంది.

సాక్షిలో కథనాల వల్లే..



నేను మేయర్‌గా ఎన్నిక కాకముందు సాక్షిలో ఈ బ్రిడ్జి కావాలని పలు కథనాలు ప్రచురితమయ్యాయి. నేను మేయర్‌గా ఎన్నిక కాగానే వంతెన ఆవశ్యకతను గుర్తించి ప్రతిపాదనలు పెట్టాం. ప్రత్యేక దృష్టి పెట్టగా బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యింది. ఈ లోలెవల్ బ్రిడ్జి డివిజన్ల ప్రజలకే కాకుండా నగర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది.

– ఆకుల సుజాత, మాజీ నగర మేయర్

నేడు కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభం

ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలోని పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ఆఫీస్‌ను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ భవనంలో సీపీ కాన్ఫరెన్స్ హాల్, సీడీఆర్ అనాలసిస్ విభాగం, ఐటీ సెల్ పోలీస్ ట్రెయినింగ్ సెంటర్ కూడా ఉండనున్నాయి.



అక్రమాలు బట్టబయిలు..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో అక్రమ నియామకాల విషయమై 'సాక్షి'లో వరుసగా 43 రోజుల పాటు కథనాలు ప్రచురితమయ్యాయి. వర్సిటీ వీసీ రవీందర్ గుప్తా, అప్పటి రిజిస్ట్రార్ కనకయ్య కలిసి ప్రభుత్వం, పాలకమండలి అనుమతి లేకుండా అవసరానికి మించి ఏకంగా 113 మందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. ఈ నేపథ్యంలో 'సాక్షి' వరుసగా 2021 సెప్టెంబర్ 16వ తేదీ నుంచి 43 రోజుల పాటు వరుస కథనాలు ప్రచురితం చేసింది. యూజీసీ నిబంధనలు బేఖాతరు, పాలకవర్గాన్ని పక్కనపెట్టి కనకయ్యకు వక్రమార్గంలో రిజిస్ట్రార్ పదవి ఇవ్వడంపై 'సాక్షి'లో వరుస కథనాలు రాగా 2021 అక్టోబర్ 22వ తేదీన హైదరాబాద్‌లో టీయూ పాలకమండలి సమావేశం ఉన్నత విద్యామండలి కమిషనర్ నవీన్ మిట్టల్ ఆధ్వర్యంలో నిర్వహించగా 'సాక్షి'లో వరుస కథనాలతో ప్రత్యేక బుక్‌లెట్ తయారు చేసుకుని వెళ్లి సుదీర్ఘంగా చర్చించారు. 2021 అక్టోబర్ 30వ తేదీన వర్సిటీలోని పాలకమండలి సమావేశంలో మరోసారి 'సాక్షి' కథనాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. అదే సమావేశంలో రిజిస్ట్రార్ కనకయ్యను తొలగిస్తున్నట్లు, అక్రమ నియామకాలను రద్దు చేస్తున్నట్లు ఉన్నత విద్యామండలి కమిషనర్ నవీన్ మిట్టల్ ప్రకటించారు. వీసీ, రిజిస్ట్రార్‌లను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. తర్వాత మళ్లీ 2021 నవంబర్ 27న హైదరాబాద్‌లో పాలకమండలి సమావేశం జరిగింది. కనకయ్య కొందరు ప్రొఫెసర్ల సర్వీస్ పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లిన విషయమై 'సాక్షి'లో కథనాలు రాగా ఆయనపై పోలీసు కేసు నమోదు చేయాలని నవీన్ మిట్టల్ వీసీకి సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్సిటీలకు కలిపి టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది నియామకాల విషయమై ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించగా రాష్ట్ర కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది.





నాయినమ్మ కష్టం తీరింది



సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామానికి చెందిన కరమంచి గంగవ్వ కొడుకు, కోడలు చనిపోయారు. దీంతో భిక్షాటన చేసి వారి ముగ్గురు పిల్లలను గంగవ్వ సాకుతోంది. 'సాక్షి' ఫ్యామిలీ పేజీలో 2020 ఫిబ్రవరి 15న 'ముగ్గురు పిల్లలు.. నాయినమ్మ' శీర్షికన కథనం ప్రచురితమైంది. అప్పటి కలెక్టర్ శరత్ గంగవ్వ మనవరాలు చామంతికి ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగం ఇప్పించారు. డబుల్ బెడ్ రూం ఇల్లు నిర్మించి ఇచ్చారు. దీంతో గంగవ్వ కష్టాలు తీరాయి. మనవరాలి పెళ్లి చేసింది. మనవడు డ్రైవింగ్, మరో మనవరాలు చదువుకుంటోంది.

నాకు ఇల్లు కట్టించి ఇచ్చిండ్రు..



నా కొడుకు, కోడలు సచ్చిపోతే.. వాళ్ల ముగ్గురు పిల్లలను బిచ్చం అడుగుకచ్చి సాదిన. పేపర్ల రాస్తే కలెక్టర్ సారు మమ్ములను పిలిపించుకుని మా కష్టాలను విన్నడు. నాకు పైసలు ఇచ్చిండు. మనవరాలికి ఉద్యోగం ఇచ్చిండు. మాకు ఇల్లు కట్టించిండు. అందరికీ దండాలు. – కరమంచి గంగవ్వ, కుప్రియాల్, సదాశివనగర్ మండలం

బాధిత కుటుంబానికి అండ..

కామారెడ్డి పట్టణంలోని పంచముఖి హనుమాన్ కాలనీకి చెందిన రాజేశ్, స్రవంతి కరోనాతో మృతిచెందారు. దీంతో రాజేశ్ తల్లి సిద్దమ్మ, కూతుళ్లు వైష్ణవి, వర్షితలు అనాథలయ్యారు. ఇదే సమయంలో రాజేశ్ ఇంటి కోసం తీసుకున్న అప్పు రూ. 18 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. బ్యాంకు నుంచి అప్పుడే ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ విషయమై 2021 మే 30న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం ఎందరినో కదిలించింది. వారి కుటుంబానికి అండగా ఉంటామంటూ పలువురు ముందుకువచ్చారు. బాధిత కుటుంబానికి కలెక్టర్ భరోసా ఇచ్చారు. పలు దఫాలుగా బ్యాంకర్లతో చర్చించి వన్ టైం సెటిల్‌మెంట్‌కు ఒప్పించి రూ.18 లక్షల రుణాన్ని రూ.10 లక్షలకు సెటిల్ చేశారు. పలువురు దాతల సాయంతో బ్యాంకు అప్పును క్లియర్ చేయించి డాక్యుమెంట్స్‌ను సిద్దవ్వ అప్పగించారు. అలాగే సిద్దవ్వకు ఔట్‌సోర్సింగ్ కింద ఉద్యోగం ఇప్పించారు.




ఎంతో మేలు జరిగింది



కొడుకు, కోడలు కరోనాతో చనిపోయిండ్రు. వాళ్ల పిల్లలిద్దరు వైష్ణవి, వర్షితలను నేనే పెంచి పెద్ద చెయ్యాలె. ఇంటి మీద లోను ఉందని బ్యాంకోళ్లు ఇబ్బంది పెడితే పేపర్ల రాసి మాకు తొవ్వ జూపిండ్రు. కలెక్టర్ మమ్ములను పిలిచి మా కష్టాన్ని ఇన్నడు. బ్యాంకోళ్లతో మాట్లాడి మొత్తం అప్పు కట్టించి ఆదుకున్నడు. 'సాక్షి' తో మాకు మేలు జరిగింది. –సిద్దమ్మ, కామారెడ్డి

గల్ఫ్ వలస కార్మికులకు బాసటగా..

మోర్తాడ్ (బాల్కొండ): కడుపు చేతబట్టుకుని గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన, వెళ్లే క్రమంలో మోసాలకు గురైన ఎంతో మంది కార్మికులకు సాక్షి బాసటగా నిలిచింది. ఆవిర్భావం నుంచి మెయిన్ పేజీలో ప్రత్యేక కథనాలను ప్రచురించడమే కాకుండా జిల్లా అనుబంధంలో గల్ఫ్ జిందగీ పేరుతో ప్రత్యేక కథనాలను ప్రచురించారు. గల్ఫ్ పేరుతో జరిగిన మోసాలను బాహ్య ప్రపంచానికి తెలియజెప్పడంతో పాటు వలస కార్మికులకు న్యాయం జరిగేలా ఎన్నో భిన్నమైన కథనాలను అందించడం విశేషం. కార్మికుల విజయాలను, కష్టాలను, కన్నీళ్లను ఆవిష్కరించడంలో సాక్షి ముందుంది. కరోనా సమయంలోను వలస కార్మికులు పరాయి దేశంలో పడిన కష్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజెప్పడానికి సాక్షి చేసిన ప్రయత్నాలు అనేకం ఉన్నాయి.



సాక్షి కృషి మరువలేం...



విదేశాలకు వలస వెళ్లినవారికి అండగా నిలువడంలో సాక్షి చేసిన కృషి మరువలేనిది. ప్రత్యేక కథనాలను ప్రచురించడంలో సాక్షి చూపిన చొరవ ఎంతో బాగుంది. ఖతర్‌లో నిర్వహించిన ప్రపంచ ఫుట్‌బాల్ క్రీడా పోటీల సమయంలో స్టేడియంల నిర్మాణంలో మన వలస కార్మికులు పోషించిన పాత్ర, వారికి జరిగిన నష్టంపై అందించిన కథనాలు ఎంతో బాగున్నాయి. బయటి ప్రపంచానికి వలస కార్మికుల శ్రమ తెలిసేలా చేసిన ప్రయత్నం ఎంతో బాగుంది.

– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు

మహారాష్ట్ర జలదోపిడీపై..

బోధన్ : శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నాందెడ్ జిల్లా ధర్మాబాద్ తాలూకా పరిధిలో గోదావరి నదిపై 2009–10 ఏడాదిలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారు. ఈ నేపథ్యంలో బాబ్లీ ప్రాజెక్టుకు ఎగువన మహారాష్ట్ర నిర్మిస్తున్న మరో 13 ప్రాజెక్టులు సాంగ్వీ, అపేగావ్, ఇరట్‌పూర్, జోగ్లాదేవి, మంగ్రూస్, రాజాతాక్లీ, మూలీ, దిగ్రాస్, అమ్దురా, దాలేగావ్, ముద్గల్, రోషన్ పురి, తహెర్గానా– పోహనేర్ నిర్మాణాల రహస్యాన్ని 'సాక్షి' బట్టబయలు చేసింది. 'దర్జాగా జలదోపిడీ ' శీర్షికన సాక్షి మెయిన్‌లో కథనం ప్రచురితం కావడంతో బాబ్లీ ప్రాజెక్టు ఉద్యమానికి మరింత ఊపు వచ్చింది. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు వెళ్లింది. 2013లో సుప్రీం కోర్టు ప్రతి ఏటా జూలై 1న బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి, అక్టోబర్ 29న మూసివేయాలని తీర్పు నిచ్చింది. తాగు నీటి అవసరాల కోసం మార్చి 1న ప్రాజెక్టు గేట్లు ఎత్తి 0.6 టీఎంసీ నీటిని దిగువ ప్రాంతానికి వదలాలని తీర్పులో పేర్కొంది.



బాబ్లీ ప్రాజెక్టు



'రైతన్నపై రౌడీ ముద్ర' తొలగింది

2014 జనవరి 12 : తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి గ్రామంలో ఓ వ్యాపారి రైతులనుంచి మక్కలను కొనుగోలు చేస్తున్నాడు. తూకంలో మోసానికి పాల్పడుతున్నట్లు గ్రహించిన రైతులు తిరగబడ్డారు. రైతులను తప్పించుకుని పారిపోయే ప్రయత్నం చేసిన సదరు దళారీని పట్టుకున్నారు. పోలీసులు గ్రామానికి చేరుకుని లారీని పంపించివేశారు. దీంతో రైతులు పోలీసులకు ఎదురుతిరిగారు. మోసం చేసిన వారిని ఎలా వదిలి పెడతారంటూ నిలదీశారు. ఈ సందర్భంగా గొడవ జరిగింది. పోలీసులు రైతులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపించడంతోపాటు రౌడీషీట్ ఓపెన్ చేశారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో కోర్టు కేసు కొట్టివేసినా.. పోలీసులు మాత్రం రౌడీషీట్ తొలగించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. దీంతో పోలీసు స్టేషన్ నోటీసు బోర్డు మీద రౌడీలుగా రైతుల ఫొటోలు అలాగే ఉండిపోయాయి. బాధిత రైతుల మనోవేదనపై 'సాక్షి' 2017 నవంబర్ 9న కథనాన్ని ప్రచురించగా.. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి, రౌడీషీట్ ఎత్తివేయించారు.



రైతు ఉద్యమాలకు అండగా నిలిచి..



ఆర్మూర్ : 2008 జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఎర్రజొన్న రైతులపై పోలీసు కాల్పుల ఘటనతో పాటు 'సాక్షి' దినపత్రికలో రైతులకు అనుకూలంగా ప్రచురితమైన కథనాలు సంచనలంగా మారాయి. ఆర్మూర్ ప్రాంతంలోని సుమారు 25 వేల రైతు కుటుంబాలు ఎర్రజొన్నలను పండించగా, సీడ్ వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గించేశారు. దీంతో రైతులు ఉద్యమ బాట పట్టగా 'సాక్షి' వారి వెన్నంటి నడిచింది. అప్పట్లో ఎర్రజొన్నను గోదావరి హైబ్రిడ్ సీడ్ కంపెనీ యజమానికే అమ్మాలని కలెక్టర్ సమక్షంలో రాత పూర్వక ఒప్పందం కుదిర్చారు. రైతులకు చెందిన 11వేల ఎర్రజొన్నలను సీడ్ వ్యాపారి తీసుకుని రూ. 32 కోట్లు చెల్లించి మిగితా రూ. 46 కోట్లు ఇవ్వలేనని చేతులెత్తేశాడు. రైతులు ఉద్యమబాటు పట్టారు. అప్పట్లో రైతు నాయకులుగా కోటపాటి నర్సింహం నాయుడు, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ప్రభాకర్, మార చంద్రమోహన్, పెద్దోళ్ల గంగారెడ్డి, నచ్చు చిన్న రాజన్న, దేవరాం తదితరులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. సీడ్ వ్యాపారుల ఇళ్లను తగులబెట్టారు. పోలీసులు కాల్పులు జరుపగా నలుగురు రైతులు గాయపడ్డారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 35 కోట్లు చెల్లించింది. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక మిగిలిన రూ. 10.58 కోట్లను కేసీఆర్ ముట్టజెప్పారు. సాక్షి తోడ్పాటును రైతులు గుర్తు చేస్తారు.



రైతు కష్టాలను తమవిగా భావించి..



జిల్లాలోని పసుపు రైతుల కష్టాలను గుర్తించి వారి కష్టాలను తమవిగా భావించి కథనాలు ప్రచురితం చేయడం వల్లే రైతులను న్యాయం జరిగింది. రైతులకు ప్రభుత్వానికి వారధిగా నిలిచింది 'సాక్షి'. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు, ఓటములను పసుపు రైతులే నిర్ణయించే పరిస్థితికి చేర్చడంలో 'సాక్షి' ప్రచురించిన కథనాలది ప్రత్యేక స్థానం. 'సాక్షి'కి పసుపు రైతులు రుణపడి ఉంటారు.

– కోటపాటి నర్సింహా నాయుడు, పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా

వెబ్‌సైట్‌లో 'పది' హాల్‌టికెట్లు

నిజామాబాద్‌అర్బన్‌: పదో తరగతి పరీక్షల హాల్‌ టికెట్లను www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో శుక్రవారం నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చని డీఈవో దుర్గాప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌ టికెట్‌పై పాఠశాల హెచ్‌ఎం సంతకం లేకున్నా పర్వాలేదన్నారు. పరీక్ష కేంద్రాన్ని ఒక రోజు ముందే వెళ్లి చూసుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే 9030282993 నంబర్‌కు ఫోన్‌ చేయాలని తెలిపారు.

ఏప్రిల్‌ 25 నుంచి ఓపెన్‌ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: ఓపెన్‌ పదో తరగతి, ఇంటర్‌ పరీక్షలు ఏప్రిల్‌ 25 నుంచి నిర్వహిస్తున్నటలు డీఈవో దుర్గాప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. మే 4న పరీక్షలు ముగుస్తాయని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్‌ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో ఇంటర్‌ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఇంటర్‌ మొదటి సంవత్సరం విద్యార్థులకు గణితం–2 బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 16,453 మంది విద్యార్థులకు 15,660 మంది పరీక్షలు రాశారని డీఐఈవో రఘురాజ్‌ తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

రుద్రూర్‌: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఈ నెల 25, 26 తేదీల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రుద్రూర్‌ కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌ డాక్టర్‌ నవీన్‌కుమార్‌ తెలిపారు. ఈదురు గాలులు గంటకి 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీసే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన పడవచ్చని పేర్కొన్నారు. రైతులు రెండు రోజులు పంట పొలాల్లో రసాయన మందులు, ఎరువులు పిచికారీ చేసుకోవద్దని ఆయన సూచించారు. కోసి ఎండబెట్టుకున్న పంట ఉత్పత్తులపై టార్పాలిన్లు కప్పుకోవాలన్నారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దు



డిచ్‌పల్లి : ర్యాగింగ్‌ పేరుతో తోటి విద్యార్థులను వేధించి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నిజామాబాద్‌ ఏసీపీ కిరణ్‌కుమార్‌ సూచించారు. డిచ్‌పల్లి మండలం బర్దీపూర్‌ శివారులోని తిరుమల నర్సింగ్‌కళాశాలలో గురువారం రాత్రి యాంటీ ర్యాగింగ్‌ సదస్సును నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా ఏసీపీ కిరణ్‌కుమార్‌ హాజరై మాట్లాడారు. ఇటీవల ఇదే కళాశాలలో బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులను మూడవ సంవత్సరం విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరి విద్యార్థులపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. డిచ్‌పల్లి సీఐ మోహన్‌, ఎస్సై గణేష్‌, తిరుమల మెడికల్‌ అకాడమి చైర్మన్‌ పరమేశ్వర్‌ రెడ్డి, కరస్పాండెంట్‌ పద్మావతి, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సాక్షి అక్షర పోరు

- సామాన్యులకు అండగా కథనాలు
- స్పందించి చర్యలు చేపట్టిన అధికారులు

ప్రజా సమస్యలపై సాక్షి పత్రిక నిరంతరం అక్షర యుద్ధం చేస్తూనే ఉంది. వరుస కథనాలతో ఎంతో మంది ఆపన్నులకు చేయూత అందించింది. అధికారుల అవినీతి భాగోతాలు, ప్రజాప్రతినిధుల కబ్జాలను వెలుగులోకి తీసుకొచ్చింది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపింది. నేడు సాక్షి 15వ వార్షికోత్సవం సందర్భంగా కథనాలు..

వన్యప్రాణుల రక్షణకు చర్యలు


జనారణ్యంలో కుక్కలకాహారం

నందిపేట్‌: నందిపేట మండలం శ్రీరాంసాగర్‌ బ్యాక్‌ వాటర్‌ ప్రాంతంలో వన్యప్రాణులు సంచరిస్తుంటాయి. ఇందులో కృష్ణజింకలు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకతను చాటుకున్నాయి. కాగా కృష్ణజింకలను కొంతకాలంగా పరిసర గ్రామాల ఊరకుక్కలు వేటాడి చంపేస్తున్నాయి. దీనిపై 'జనారణ్యంలో కుక్కలకాహారం' అనే శీర్షికన సాక్షి పత్రిక 2022 ఏప్రిల్‌ 20న కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన అటవీశాఖ, రెవెన్యూ, పోలీసు అధికారులు చొరవ తీసుకు కృష్ణజింకల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జింకల సంచరించే ప్రాంతాల్లో పోలీసులు పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు ఆధ్వర్యంలో గస్తీ దళాలను ఏర్పాటు చేశారు. పర్యాటక శాఖ వారు కాటేజీల ఏర్పాటు కోసం ప్రతిపాదనలతో ముందుకు వెళ్తున్నారు.

రైతు సమస్యలపై కథనాలు



మోర్తాడ్‌: రైతుల సమస్యలపై సాక్షిలో మొదటి నుంచి విభిన్నమైన కథనాలను ప్రచురించారు. రైతుల కష్టాలు, విజయాలను కళ్లకు కట్టినట్లు ప్రచురించడం ఎంతో బాగుంది. పసుపు, విత్తన జొన్నలు, వరి, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర, దళారుల డ్రామాలు ఇతర ఎన్నో అంశాలను ప్రతి సీజనులో ప్రచురిస్తూ రైతులకు అండగా ఉండటం రైతులు మరచిపోరు. – లింగారెడ్డి, రైతు, గుమ్మిర్యాల్‌

కార్పొరేషన్‌లో మార్పులకు సాక్షి


'భూ' మంతర్‌!

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో పలు మార్పులకు సాక్షి కథనాలు సాక్ష్యంగా నిలిచాయి. అడ్డూ అదుపు లేకుండా జరుగుతున్న అక్రమాలపై సాక్షి కథనాలతో నిఘా ఏర్పడింది. అస్తవ్యస్తంగా ఉన్న శానిటేషన్‌ దారిలోకి వచ్చింది. ఇష్టారాజ్యంగా వాడేస్తున్న డీజిల్‌ లెక్కలు అదుపులోకి రావడంతో నెలలోనే రూ.10లక్షలు ఆదా అయ్యాయి. ఏళ్ల తరబడిగా కార్పొరేషన్‌లో శానిటేషన్‌ విభాగం అధ్వానంగా మారింది. ఇన్‌చార్జి ఎంహెచ్‌వో, శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్ల ఆగడాలకు అంతు లేకుండా పోయింది. ఏ జోన్‌లో ఎవరు విధులు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి ఉండేది. దీనిపై సాక్షి కథనాలు ప్రచురించడంతో కార్మికులు డుమ్మా కొట్టడం ఆగింది. సమయ పాలన పాటిస్తు ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 2.00గంటల వరకు ప్రతినిత్యం విధులు నిర్వహిస్తున్నారు. ఏళ్ల తరబడిగా శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్లు డీజిల్‌ వాడకున్నా వాడిన్నట్లు బిల్లులు చూపించి జేబులో డబ్బులు వేసుకున్నారు. దీనిపై సాక్షి కథనంలో మున్సిపల్‌ కమిషనర్‌ ప్రత్యేకంగా నిబంధనన పెట్టడంతో ఒక్క నెలలో రూ.10లక్షల వరకు ఆదా అయింది.

కబ్జాలకు అడ్డుకట్ట

నగరంలో భూ కబ్జాలపై సాక్షి కథనాలతో అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో అలజడి మొదలైంది. నగరంలోని ధర్మపురిహిల్స్‌లో సర్వే నంబర్‌ 252, 249లో 1100గజాల ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. ఎల్లమ్మ గుట్ట ప్రాంతంలో ప్రధాన రహదారి ఆనుకోని సర్వే నంబర్‌ 60 నుంచి 90వరకు ఉన్న 15 ఎకరాల భూమి కబ్జా చేయడానికి కుట్రలు జరిగాయి. ప్రస్తుతం కబ్జా ఆగిపోయింది. ఆటోనగర్‌లో సర్వే నంబర్‌ 2345 నుంచి 2366 గల 500గజాల భూమి రూ.10కోట్లకు పైగా ఉంటుందని సాక్షి కథనంలో కబ్జా ఆగింది. ధర్మపురిహిల్స్‌లో శ్మశానాల భూమి కబ్జా చేయడానికి కార్పొరేటర్‌ హరోన్‌ఖాన్‌ యత్నించగా సాక్షి కథనాలతో కబ్జా ఆగింది. పైగా సదరు కార్పొరేటర్‌ను ఆ పార్టీ నుంచి సస్పెండ్‌ చేశారు.

సేవలు మరువలేని



నిజామాబాద్‌అర్బన్‌: తెలంగాణ ఉద్యమ సమయంలో సాక్షి కథనాలు బాగున్నాయి. మేము చేసిన నిరసన కార్యక్రమాలకు మంచి కవరేజీ ఇచ్చి ఉద్యమానికి చేసిన సాయం మరువలేనిది. ప్రస్తుతం కూడా అన్ని రంగాల వారికి ఎంతో తోడ్పాటుగా ఉంటూ మంచి కథనాలు ప్రచురిస్తోంది. – పుప్పలరవి విద్యార్థి సంఘం నాయకుడు

- శానిటేషన్‌ విభాగంలో క్రమశిక్షణ దారిలోకి వచ్చిన డీజిల్‌ లెక్కలు


డీజిల్‌నూ తాగేశారు

జింకల కోసం ప్రత్యేక చర్యలు



డొంకేశ్వర్‌ మండలంలోని గాదేపల్లి, జీజీనడ్కుడ, నూత్‌పల్లి, గంగాసరం, అన్నారం, సిర్‌పూర్‌ గ్రామ ప్రాంతాలలోని ఎస్‌ఆర్‌ఎస్పీ బ్యాక్‌ వాటర్‌లో గతంలో కృష్ణజింకలు ఊరకుక్కల దాడిలో చనిపోయేవి. సాక్షిలో వచ్చిన వార్తతో అధికారులు స్పందించారు. కృష్ణ జింకల రక్షణ కోసం ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఇప్పుడు కృష్ణ జింకలపై ఊర కుక్కల దాడులు జరగడం లేదు. – నక్కల భూమేష్‌, సర్పంచ్‌, గాదేపల్లి, డొంకేశ్వర్‌ మండలం

సాక్షి కథనంతో..



పంట పొలాల్లో ఆహారం కోసం వచ్చిన కృష్ణజింకలు, నెమళ్లను వీధి కుక్కలు చంపిన దృశ్యాలు కంటపడి తట్టుకోలేక పోయేవాళ్లం. సాక్షిలో వచ్చిన కథనంతో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. – లోక లక్ష్మణ్‌, రైతు, నూత్‌పల్లి గ్రామం, డొంకేశ్వర్‌ మండలం

ఎంతో మందికి ప్రయోజనం



సాక్షి కథనాలు ఎంతో మందికి ప్రయోజనం కల్గిస్తున్నాయి. జిల్లా వైద్యశాఖలో అవినీతి, భూకబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్‌లు వంటి అనేక విషయాలను వెలుగులోకి తెచ్చింది. తెలంగాణ వర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై కథనాలను రాయడంతో అవినీతికి అడ్డుకట్ట పడింది. – వేణు, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

నష్టాలు తగ్గాయి



నిజామాబాద్‌నాగారం: శానిటేషన్‌ పరిధిలో డీజిల్‌లో అక్రమాలు జరుగుతున్నాయని కథనాలు వెలువడ్డాయి. సాక్షిలో కథనాలు రావడంతోనే ప్రత్యేకంగా తనిఖీలు జరిగాయి. దీంతో కార్పొరేషన్‌కు ఒక నెలలోనే రూ.10లక్షల ఆదాయం వచ్చింది. డీజిల్‌ను దుబారా చేస్తే సహించేది లేదు. సాక్షిలో ప్రచురితమైన మంచి కథనాలకు కచ్చితంగా ప్రజాదరణ ఉంటుంది. 15వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సాక్షికి అభినందనలు. – దండు నీతూకిరణ్‌, నగర మేయర్‌

సాక్షి చొరవతో వంతెన నిర్మాణం



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్‌, కలిగోట్‌ గ్రామాల మధ్య రొడ్డం వాగుపై వంతెన నిర్మాణం కొనసాగుతోంది. ఈ రెండు గ్రామాల మధ్య లోలెవల్‌ వంతెన ఉండేది. గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు అది ధ్వంసమైంది. దీంతో రెండు గ్రామాల మధ్య సుమారు 20 రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో వంతెన ఆవశ్యకతపై సాక్షిలో ఎన్నో సార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.95కోట్లను మంజూరు చేసింది. ప్రస్తుతం వంతెన పనులు సాగుతున్నాయి. సాక్షి దినపత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు. – పొట్టురి తిరుపతిరెడ్డి, వైఎస్సార్‌టీపీ రూరల్‌ కన్వీనర్‌

మా గ్రామానికి గుర్తింపు



మాక్లూర్‌: అడవి మామిడిపల్లి గ్రామానికి చెందిన 21 మంది దేశ సేవ కోసం జవాన్లుగా మారిన విషయాన్ని సాక్షి దినపత్రిక గుర్తించి స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా జై హింద్‌ మామిడిపల్లి అంటూ ప్రత్యేక కథనం ఇచ్చింది. దీంతో మా గ్రామానికి జై హింద్‌ మామిడిపల్లిగా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చి పెట్టింది. అప్పటి నుంచి గ్రామంలో మరింత మంది యువకులు సైన్యంలోనికి వెళ్లటానికి ఉత్సాహం చూపుతున్నారు. – చింత ప్రవీణ్‌రెడ్డి, అడవి మామిడిపల్లి

సదస్సు అభినందనీయం



సుభాష్‌నగర్‌: ఇందూరు బిడ్డ సాధించిన ఘనతను సాక్షి దినపత్రికలో ప్రచురించడంతో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. వెయ్యిమంది నిరుద్యోగుల కోసం సాక్షి అవగాహనా సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయం. సివిల్స్‌ సాధించిన నేను, విజయ రహస్యాలు, ప్రిపరేషన్‌, సబ్జెక్టు, స్ట్రాటజీ, అనుభవం, తదితర అంశాలను వారితో పంచుకునే అవకాశం కల్పించారు. నా ప్రయాణం చెప్పుకోవడానికి సాక్షి పత్రిక మంచి ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా సివిల్స్‌లో 136వ ర్యాంకు సాధించిన తర్వాత 'అమ్మకు అంకితం' పేరుతో కథనాన్ని ప్రచురించారు. ఆ కథనాన్ని పొందుపర్చి ప్రత్యేకంగా రూపొందించిన జ్ఞాపికతో నన్ను సత్కరించడాన్ని జీవితంలో మర్చిపోలేను. సాక్షి దినపత్రిక యాజమాన్యం, సిబ్బందికి ధన్యవాదాలు. – అరుగుల స్నేహ, ఐఏఎస్‌ (ప్రొబేషన్‌)

నిలువు దోపిడీకి అడ్డుకట్ట


విచ్చలవిడి దోపిడీ

నిజామాబాద్‌అర్బన్‌: ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారితో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది ఆస్పత్రుల పాలై ఆర్థిక ఇబ్బందులు పడ్డారు. ఈ తరుణంలో ప్రైవేట్‌ ఆస్పత్రులు రోగులను నిలువు దోపిడీ చేశాయి. మూడింతల ఫీజులను వసూలు చేశాయి. రక్త పరీక్షలకు రూ.5000, సిటి స్కాన్‌కు రూ.15000 వరకు తీసుకున్నారు. ప్రైవేట్‌ ఆస్పత్రుల దోపిడీపై సాక్షి కథనాలు ప్రచురించింది. 2020 ఆగస్టు 25, 26 తేదీల్లో వచ్చిన కథనాలతో జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. అప్పటి కలెక్టర్‌ నారాయణరెడ్డి ఎనిమిది టాస్క్‌ ఫోర్స్‌ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ప్రైవేట్‌ ఆస్పత్రులను తనిఖీ చేసి రోగుల వద్ద వసూలు చేసిన బిల్లులను పరిశీలించారు, దీంతో ప్రైవేట్‌ ఆస్పత్రులు ఫీజుల దోపిడీ తగ్గింది.

'అక్రమాలపై విచారణ జరిపించండి'


కలెక్టర్‌కు లేఖ అందిస్తున్న ప్రభుత్వ విప్‌ గోవర్ధన్‌

సాక్షి, కామారెడ్డి: రాజంపేట మండలం తలమడ్ల గ్రామ శివారులో నెలకొల్పన సోలార్‌ విద్యుత్‌ కంపెనీల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ను కోరారు. గురువారం ఆయన కలెక్టర్‌ను కలిశారు. భూముల వివరాలను జత చేస్తూ ఫిర్యాదు లేఖ అందించారు. తలమడ్ల శివారులోని 595/1 సర్వేనంబరులో 18.12 ఎకరాల భూమి, సర్వే నంబరు 596/1 లో 19.03 ఎకరాల భూమి ఉండగా అందులో 15.36 ఎకరాలు, సర్వేనంబరు 597/1 లో 16.38 ఎకరాలకుగాను 13.36 ఎకరాలు, సర్వేనంబరు 598/1 లో 13.28 ఎకరాలకుగాను 13.28 ఎకరాలు, సర్వే నంబరు 599/1 లో 14.38 ఎకరాలుండగా 8.25 ఎకరాలు, సర్వే నంబరు 576లో మూడెకరాల భూములను సోలార్‌ కంపెనీలు ఆక్రమించుకున్నాయని ఆరోపించారు. ఆయా సర్వే నంబర్లన్నింటిలో కలిపి 70.19 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. దీనిపై లోతైన దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్షయ నిర్మూలనలో జిల్లాకు బంగారు పతకం

నిజామాబాద్‌ సిటీ: క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేసిన జిల్లా వైద్యశాఖకు బంగారు పతకం దక్కింది. క్షయ వ్యాధి నిర్మూలనకు జిల్లా టీబీ యంత్రాంగం పెట్టుకున్న లక్ష్యాలను సాధించే కార్యక్రమాల అమలులో ప్రతిఒక్కరూ తీవ్రంగా కృషి చేశారు. ఈ లక్ష్యాలను సాధించే జిల్లాలకు ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం బంగారు పతకాన్ని ప్రకటిస్తుంది. క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో నిజామాబాద్‌ జిల్లాతో పాటు మరికొన్ని జిల్లాలు బంగారు పతకానికి అర్హత సాధించాయి. ఇందులో నిజామాబాద్‌ జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకానికి అర్హత సాధించింది. శుక్రవారం న్యూఢిల్లీలో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఎం సుదర్శనం ఈ అవార్డును అందుకోనున్నారు.

రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలి


మాట్లాడుతున్న సీపీ నాగరాజు

ఖలీల్‌వాడి : మహిళా ఫుట్‌బాల్‌ క్రీడలో రాణించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని సీపీ నాగరాజు అన్నారు. గురువారం జిల్లా పోలీస్‌పేరేడ్‌ గ్రౌండ్‌లోని ప్రశాంతి నిలయంలో జరిగిన ఫుట్‌బాల్‌ శిక్షణ ముగింపు కార్యక్రమానికి సీపీ హాజరై ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు జిల్లా కేంద్రంలో కోచింగ్‌ క్యాంప్‌ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. పంజాబ్‌లో ఈనెల 28 నిర్వహించే సందర్భంగా జాతీయస్థాయి క్రీడల్లో రాష్ట్రానికి మంచి పేరు తేవాలన్నారు. క్రీడాకారులకు కిట్స్‌ అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి మధుసూదన్‌ రావు, ఏసీపీ కిరణ్‌ కుమార్‌, ఏఆర్‌, ఏసీపీ సంతోష్‌ కుమార్‌, రాష్ట్ర ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ సెక్రెటరీ డాక్టర్‌ కవితా రెడ్డి, మహిళా ఫుట్‌బాల్‌ క్లబ్‌ చైర్మన్‌ షకీల్‌ హైమద్‌, జిల్లా ఫుట్‌ బాల్‌ ప్రెసిడెంట్‌, రాజేందర్‌ రెడ్డి, ఒలంపిక్‌ సంఘం ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, కేర్‌ ఫుట్‌బాల్‌ అకాడమీ చైర్మన్‌ నరాల సుధాకర్‌ తదితరులు ఉన్నారు.

లైబ్రరీలను బలోపేతం చేయాలి



డిచ్‌పల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలను బలోపేతం చేసేందుకు టీచర్లు కృషి చేయాలని డీఈవో ఎన్‌వీదుర్గాప్రసాద్‌ సూచించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మానవతసదన్‌లో జిల్లాలోని 152 పాఠశాలల హెచ్‌ఎంలకు గురువారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 152 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఒక్కొక్క పాఠశాలకు 259 పుస్తకాల చొప్పున పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవోతో పాటు ఏఎంవో డి.చంద్రశేఖర్‌, మాజీ ఏఎంవో నర్రా రామారావు, రిసోర్స్‌ పర్సన్స్‌ సంతోష్‌, వెంకటేష్‌, మానవతసదన్‌ ఇన్‌చార్జి సుధాకర్‌ రావు, కేర్‌టేకర్‌ రమేష్‌, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలపై నిలిచిపోయిన గూడ్స్‌ రైలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ శివారులోని మాధవనగర్‌ ప్రాంతంలో రైల్వే ట్రాక్‌పై గూడ్స్‌ రైలు ఇంజిన్‌ చెడిపోవడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గురువారం సాయంత్రం హైదరాబాద్‌, అకోలా ఇంటర్‌ సిటీ ఎక్స్‌ప్రెస్‌ గంట పాటు డిచ్‌పల్లి స్టేషన్‌లో ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గూడ్స్‌ రైలుకు మరో ఇంజిన్‌ ఏర్పాటు చేయడంతో రాకపోకలు కొనసాగాయి.

'మిల్లింగ్‌ లక్ష్యాన్ని చేరుకోవాలి'

కామారెడ్డిక్రైం: వానాకాలం, యాసంగి(2021–22) సీజన్లకు సంబంధించిన ధాన్యం కస్టమ్‌ మిల్లింగ్‌ లక్ష్యాన్ని ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం రైస్‌ మిల్లర్ల అసోసియేషన్‌ ప్రతినిధులు, అధికారులతో సీఎంఆర్‌పై సమీక్షించారు. లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్‌ చేయని రైస్‌మిల్లుల యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌, డీఎస్‌వో పద్మ ఉన్నారు.

ఫైనల్‌కు నిఖత్‌



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన బాక్సర్‌ నిఖత్‌ జరీన్‌ వరల్డ్‌ బాక్సింగ్‌ చాంపియన్‌షిప్‌లో విజయాలతో దూసుకెళ్తోంది. గురువారం జరిగిన సెమీస్‌లో ఆమె ప్రత్యర్థిని 5–0 తేడాతో చిత్తు చేసి ఫైనల్‌కు చేరింది. సెమీస్‌లో ఆమె కొలంబియాకు చెందిన ఇంగ్రిట్‌ అనే క్రీడాకారిణిని ఓడించింది.

పోలీస్‌ స్టేషన్‌లోనే కొట్టుకున్నారు



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ నగరంలోని ఆరో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలోనే బుధవారం రాత్రి రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు కొట్టుకున్నారు. ధర్మపురి హిల్స్‌కు చెందిన ఫర్హా బేగం, ఫరీదా బేగం పక్క పక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. బుధవారం ఓ చిన్నారి ఆడుకుంటూ పక్కనే ఉన్న మరో నివాసంపై అనుకోకుండా రాయి పడేయడంతో ఇరు కుటుంబాలకు చెందిన మహిళల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ గొడవ మహిళల నుంచి కుటుంబ సభ్యుల వరకు దారి తీసింది. ఆ గొడవ కాస్త పెరిగి పెద్దదిగా కావడంతో రెండు వర్గాలకు చెందిన వారు పోలీస్‌ స్టేషన్‌ వరకు వెళ్లారు. ఠాణాలో సిబ్బంది వివరాలు తెలుసుకునేలోపే ఇరువర్గాల మధ్య మాటమాట పెరిగి గొడవకు దారి తీసింది. దీంతో రెండు వర్గాలకు చెందిన వారు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడిలో పలువురు గాయపడినట్లు తెలిసింది. రెండు వర్గాలకు చెందిన ఏడుగురితోపాటు ఇతరులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్‌ గౌడ్‌ తెలిపారు.

క్రైం కార్నర్‌

కత్తిపోట్ల కలకలం

బాల్కొండ: మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురైన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. బాల్కొండ ఎస్సై గోపి తెలిపిన వివరాలు..మండల కేంద్రానికి చెందిన సయ్యద్‌, జాకీర్‌, సయ్యద్‌ హన్నన్‌ అన్నదమ్ములపై అదే గ్రామానికి చెందిన సమీర్‌, అజార్‌, సలీం, నిజ్జులు పాత కక్షలను మనసులో పెట్టుకుని కత్తులతో దాడి చేశారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం ఆర్మూర్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మద్నూర్‌: మండలంలోని సిర్పూర్‌ గ్రామానికి చెందిన మటపతి రాజప్ప(45) అనే కౌలు రైతు గురువారం పొలానికి పురుగుల మందు స్ప్రే చేస్తుండగా విద్యుత్‌ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన సమద్‌ అనే రైతు పొలాన్ని ఆయన కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


పల్లవి మృతదేహం

ఆర్మూర్‌టౌన్‌: అత్తింటి వారి వేధింపులు తాళలేక ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌ చెందిన ఉప్పు నూతుల పల్లవి (28) ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. సిరికొండ మండలం గడ్కోల్‌కు చెందిన పల్లవికి పెర్కిట్‌కు చెందిన శివకుమార్‌తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. కొద్ది రోజులుగా ఆమెను అత్తింటి వారు వేధిస్తున్నారు. దీంతో గురువారం యాసిడ్‌ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు పెర్కిట్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. దీంతో ఇరు కుటుంబాల సభ్యులు ఆస్పత్రి వద్ద గొడవ దిగడంతో పోలీసులు చేరుకొని సముదాయించి అక్కడి నుంచి పంపించారు. మృతురాలి తండ్రి పార్వతి మల్లాగౌడ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వీఆర్‌ఏ..

నవీపేట: మండలంలోని ఆశాజ్యోతి కాలనీకి చెందిన వీఆర్‌ఏ గుట్టమీది క్రాంతి కుమార్‌ ఆర్థిక ఇబ్బందులతో గురువారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన క్రాంతికుమార్‌ వీఆర్‌ఏగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్యతో తరచూ గొడవలు జరిగేవి. దీంతో ఇటీవల ఆమె పుట్టింటికి వెళ్లింది. భార్యాభర్తల మధ్య నెలకొన్న విభేదాలు, ఆర్థిక ఇబ్బందులతో క్రాంతి కుమార్‌ మనస్తాపం చెంది పురుగుల మందు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.